కథ

# జీవన ధార!

పెండ్యాల సుబ్బారావు

రామారావు ఏకపత్నీవ్రతుడేమీ కాదు. పైగా సకల గుణాభి రాముడు. సాంప్రదాయ కుటుంబంలోనే పుట్టినా సర్వ దుర్వ్యసనాలకు పుట్టినిల్లు అతడు.

రామారావు భార్య జానకి మాత్రం భూదేవంత సహనమున్న ఉత్తమ ఇల్లాలు. నాల్గున్నర దశాబ్దాల క్రితం ఓ పల్లెటూరిలో పుట్టిన జానకికి స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ వాదం,స్త్రీ హక్కులు,స్త్రీ స్వాతంత్ర్యం లాంటి పదాలకు అసలు అర్థమే తెలీదు.కమ్మగా వేళ పట్టున భర్తకూ, పిల్లలకూ వండి పెట్టడం. వంటింటినీ, ఇంటినీ చక్కగా సర్దుకోవడం. వేళకాని వేళల్లో భర్తకి వచ్చే చిరాకుల్నీ, చీవాట్లనూ భరించడం, చిన్న చిన్న విషయాలకు రాద్ధాంతం చేసి ఉద్రేకంలో తన ఎముకలు విరగ్గొట్టినా కిమ్మనకుండా, ఉండడం జానకి జీవితం.

“షట్కర్మయుక్తాం నిజ ధర్మపత్నీ” అని నమ్మిన ఇల్లాలు ఆమె.

“ఇంటికి గుట్టు - రోగానికి రొష్టు” అవసర మంటారు.

జానకి ఏనాడూ తన భర్త గురించి కనీసం తన పుట్టింటి వారితో కూడా పల్లెత్తు మాట చెప్పలేదు.

పెద్దగా ప్రపంచ జ్ఞానంలేని, చదువులేని జానకి అంటే రామారావు దృష్టిలో- వేళకు అవసరాలు తీర్చే ఒక మానవ యంత్రం.

భర్త గురించి వాళ్ళూ, వీళ్ళూ ఏమైన చెప్పినా పెళ్ళయిన ఈ పాతిక సంవత్సరాలలోనూ ఏనాడూ భర్తను నిలదీయలేని అమాయకురాలు జానకి. పంచాయితీ సమితి ఎలిమెంటరీ స్కూల్లో మాస్టారు ఉద్యోగం చేస్తున్న రామారావును... పెళ్ళయిన నాటి నుండి “నాకు ఫలావాది కావాలి కొని పెట్టండని” జానకి నోరు తెరచి అడగలేదు.

‘నీకిది తెచ్చాను జానకీ’ అని ఎప్పుడూ రామారావు ఇచ్చిన పాపాన పోలేదు. పైగా జానకికి పుట్టింటి వారు పసుపు కుంకాల కింద ఇచ్చిన కాస్త పొలాన్ని ధిలాసాగా తన విలాసాలకు ఖర్చు చేశాడు.

అతనికి వచ్చే జీతంతో ఇద్దరు పిల్లలూ, తామూ ఎంతో హాయిగా బతకవచ్చు. కానీ తన స్నేహితుల సరదాలు, షికార్లు అతణ్ణి మాత్రమే సుఖంగా ఉండనిచ్చి... ఇంటిని ఎప్పుడూ అయ్యవారి నట్టిల్లులాగా ఉంచేవి.

మధ్య తరగతి సాంప్రదాయాలను పాటించడం తోనూ పిల్లలను పెంచిపెద్ద చేయడంలోనూ... ఇంట్లో ఏ గొడవలూ రాకుండా ఉండేందుకు సతమత మవ్వడంతోనూ జానకి తలపండిపోయింది.


కొడుకు నిరంజన్ కూతురు శైలజ చిన్నతనంలో తండ్రికి భయపడేవారు. వయస్సు వస్తోన్న కొద్దీ నలుగుర్నీ చూస్తుంటే తమ ఇంటిమీద తమకే అసహ్యం కలిగేది వాళ్ళకి.

నిరంజన్ డిగ్రీ పూర్తికాగానే, కొంచెం రెక్కల్లో శక్తిరాగానే... పట్టా ముక్కున కరుచుకుని తన స్నేహితు డి ఆహ్వానాన్నందుకుని హైదరాబాద్ ఎగిరిపోయాడు.

అక్కడే ఓ పిల్లను ప్రేమించి జానకి, రామారావుల మాటను ఖాతరుచేయకుండా ప్రేమించిన పిల్లనే పెళ్ళాడి సెటిలయిపోయాడు.

‘ఆ తండ్రికి కొడుకే కదా’ అని నలుగురూ నవ్వుకున్నారు.

జానకికి కూతురి పెళ్ళి పెద్ద బెంగయిపోయింది. కొడుకు ఎలానూ కలిసిరాలేదు. కూతురి పెళ్ళయినా వెంటనే చేయడం అవసరమని కోరగా కోరగా, ఏ



కలనున్నాడో రామారావు... 'సరే' అని ఓ నిర్ణయం తీసుకున్నాడు.

ఇంకా అయిదు సంవత్సరాల్ల సర్వీసు ఉండగానే 'వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని' ఆ వచ్చే డబ్బుతో తగిన సంబంధం చూసి శైలజ పెళ్ళియిందన్పించారు.

జానకి మొహం చూసి నలుగురూ నాలుగు చేతులువేసి శైలజ పెళ్ళి జరిపించారు. వచ్చిన డబ్బులో కొంత డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశానని చెప్పాడు రామారావు. అయితే అదంతా అబద్ధమని రామారావుకు దగ్గర్లో ఉన్న సిటీలో ఇంకో చిన్న ఇల్లు ఉందని, ఆ డబ్బంతా అక్కడ ఖర్చుచేశాడని జానకికి లోపాయి కారీగా తెలిసింది.

అంతే కాదు ఫాలాక్షుడి మాట కూడా వినని రామారావు ఇంత అకస్మాత్తుగా 'వాలంటరీ రిటైర్‌మెంటు' తీసుకోవడానికి అసలు కారణం కూతురి పెళ్ళికంటే చిన్న ఇంటి అవసరమే ప్రధానమని జానకికి ఆలస్యంగా తెలిసింది.



జీవితమంతా ఎన్నో కష్టాలు భరిస్తూ కూడా నోరుమెదపనందుకు జానకిని చుట్టాలంతా చేతకానిదని అన్నారు. చుట్టుపక్కల వాళ్ళు అమాయకురాలన్నారు. రామారావు ఉద్యోగానికి ఉద్వాసన చెప్పేశాక అతని సరదా తిరుగుళ్ళకి మరింత స్వేచ్ఛ దొరికింది.

ఓ రోజు రాత్రి భోజనం పూర్తయ్యాక రామారావు వాలు కుర్చీలో కూర్చొని సిగరెట్టును ఆస్వాదిస్తూ ఏదో పత్రిక తిరగేస్తున్నాడు.

సరిగ్గా అప్పుడు విప్పింది,, రెండున్నర దశాబ్దాలుగా మౌనం దాల్చిన జానకి తన గళాన్ని.

"నేను హైదరాబాదు వెళ్ళిపోతున్నాను."

"నీ కొడుకు రమ్మని ఉత్తరం రాశాడేమిటి"

"లేదు"

"అవునూ ఏవిటా భాష వెళ్ళిపోతున్నా... నేమిటి? మళ్ళీరావా?"

"రాను"

"అబ్బో ఏం! తల వండుతున్న క్రొద్దీ... బిరుసెక్కుతున్నట్టుందే..అయినా ఇక్కడికి రాకపోతే నీకు దిక్కెవరే!

"దిక్కులేని వాళ్ళు చాలా మంది బతుకుతున్నారు. ఈ లోకంలో..."

"ఏం... బెదిరిస్తున్నావా? పోతే...పో... నీడపట్టున కడుపులో చల్ల కదలకుండా సాగిపోతూంటే నీకేమీ తెలియడంలేదు. అడుగు బయట పెట్టిన తరువాత తెలిసొస్తుంది ఆడదాని బతుకేమిటో..."

తరతరాలుగా ఈ బెదిరింపులే ఆడదాన్ని పిరికితనంలో ముంచెత్తి మగవాడి చెప్పు కింద నలిగేలా చేస్తున్నాయి. తెగింపు అనేది రానేకూడదుగానీ ఆ ఘడియే వస్తే... స్త్రీ... ఏమైనా చేయగలదు... ఇంకా ఈ సంకెళ్ళలో, సంప్రదాయ భీరువులా బ్రతకదలచుకోలేదు జానకి.


మర్నాడే హైదరాబాదులో బాలానగర్‌లో ఉంటున్న తన పెదనాన్న కొడుకు, రామకృష్ణ ఇంటికి వెళ్ళిపోయింది. జానకిని ఎరిగున్న వారెవరైనా సరే ఆమెను కళ్ళకద్దుకుని మరీ ఆహ్వానిస్తారు.

రామకృష్ణ, అతని భార్య, ఇద్దరూ ఉద్యోగస్తులు కావడంతో వారికి జానకి ఆసరా ప్రాణంలేచి వచ్చినంత సుఖంగా ఉంది.

వీరి ఆదరణ, అండ జానకి పడ్డ ఆందోళనను పోగొట్టి చెప్పలేనంత మనశ్శాంతిని ఇచ్చింది.

జానకి వెళ్ళిన నాటి నుంచి రామారావు 'రొటీన్ లైఫ్'లో చాలా మార్పు వచ్చింది. పొద్దుటే లేవగానే బ్రష్ మీద పేస్ట్ నుంచి రాత్రి పడుకోబోయే బెడ్ మీద నీట్‌గా వేసే దుప్పటి వరకూ... సమయానుకూలంగా అన్ని సదుపాయాలూ జరిగిపోయినంత కాలం వాటి విలువ తెలియలేదు రామారావుకు.

## సొనాలీ సంబరం



సొనాలీ బెంద్రే నటించిన సినిమాలు ఆగ్, నారాజ్ రెండూ ఫ్లాప్ అయ్యాయి! హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభంలోనే సొనాలీకి ఇలాంటి ఎదురుదెబ్బ తగలడం విచారకరమే.

అయితే సొనాలీని మెచ్చుకుంటున్న వాళ్ళూ లేకపోలేదు.

'సొనాలీ మంచి అందగత్తె, చక్కని నటి కూడా. అంతేకాదు టావ్ హీరోయిన్ కాదగిన లక్షణాలున్నాయి' అంటూ పొగిడాడు సునీల్ శెట్టి ఈ మధ్య.

ఈ పొగడ్తకి సొనాలీ తెగ సంబరపడిపోతోంది.

-మౌర్య.

ఇప్పుడు జానకి లేనిలోటు అతనికి అడుగడుగునా క్షణం క్షణం తెలిసొస్తుంది. అన్నింటి కంటే ముఖ్యమైనది... తిండి సదుపాయం.. వేళ పట్టున పొగలు కక్కే ఫిల్టరు కాఫీ నుంచి... ఆత్మకింపయిన భోజనం వరకు. నోటికి అందించిన వరకూ, ఆ పనుల వెనుక గల ప్రేమ, శ్రమ, బాధ్యత తెలియలేదు. వేళ పట్టున వండి వడ్డించే భార్య లేకపోతే బ్రతుకు ఎంత దుర్భరమో, తోడులేని జీవితం ఎంత నరకమో రామారావుకు అర్థమవుతోంది.

ఓ వారం రోజులు ఎలాగో గడిపి తర్వాత ఇంటికి తాళం పెట్టి... సిటీలో ఉన్న చిన్నింటికి వెళ్ళాడు. వట్టిపోయిన గేదెను ఇన్నాళ్ళూ పాలు తాగిన యజమానే కృతజ్ఞత లేకుండా కసాయి వాడికి అమ్మేస్తాడు.

అలాంటిది.. రిటైరై, వయసు ఉడిగి, ప్రయోజకత్వం కోల్పోయిన రామారావును ఆదరించి సపర్యలు చేయడానికి అక్కడ ఉన్నద అతను కట్టుకున్న ఇల్లాలేమీ కాదుగా, ఆకట్టుకున్నవెల యాలు మాత్రమే. 'ఛీ' కొట్టి బయటకు దయచేయ మంది.

రామారావుకు కళ్ళు తెరుచుకున్నాయి.

ఒకనాటి వడ్డించిన విస్తరి లాంటి రామారావు జీవితం నేడు విసిరేసిన విస్తరాకులా మారింది. "వృధానాం బాల్య చాపల్యం" అన్నారు.

వార్ధక్యం వస్తున్న కొద్దీ. వారిని చిన్నపిల్లల్ని చూసినంత జాగ్రత్తగా చూసి వారి రుచులను. అభిరుచులను తీర్చాలి. అందుకు ఒకరి తోడు అవసరం.. ఆ ఒకరు అనేది ఎవరో కాదు. తాళి కట్టిన నాటినుండి శరీరం మనస్సు పంచి ఇచ్చి తోడుగా నీడగా నిలిచే అర్ధాంగి మాత్రమే!

కొన్నింటిని దూరం చేసుకుంటే, వాటిని తిరిగి పొందడం దుర్లభం. చేతిలో ఉన్నప్పుడు విలువ తెలిసికోకపోతే చేజారాక ఎంత బాధపడినా నిష్ప్రయోజనం... తానో మేధావి, తాను సర్వ స్వతంత్రుడనుకొని జానకిని పురుగుకంటే హీనంగా చూసిన రామారావు బ్రతుక్కి ఈనాడు అర్థం లేకుండా పోయింది.

రెండు మాసాలు గడిచేసరికి రామారావు అయిదేళ్ళ వార్ధక్యం మీద పడిన వాడిలా అయిపోయాడు... అతను నవ్వే కాలంలో చుట్టూచేరిన పది మందిలో ఒక్కరుకూడా ఇప్పుడులేరు.

ఏనాడూ చుట్టాలకూ,చుట్టు పక్కల వాళ్ళకూ విలువ ఈయని రామారావుని ఎవరు మాత్రం ఎందుకు పట్టించు కుంటారు. పైగా ఆనోటా, ఈనోటా అనుభవి స్తున్నాడు.

"ఉత్తమ ఇల్లాలిని క్షోభపెడితే ఊరికే పోతుందా!' ఒకప్పుడు వెనక మాట్లాడిన మాటలు అప్పుడు ప్రత్యక్షంగా కూడా అంటున్నారు.

రామారావు ఈ పరిస్థితిని తట్టుకోలేక ఓ నిర్ణయం తీసుకున్నాడు. జానకికి మూడు పేజీల ఉత్తరం రాసి, రెండు వందల రూపాయలు మనియార్డరు పంపి, తన తప్పును మన్నించమని, పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నానని వాపోయాడు.

కళ్ళల్లో వత్తులేసుకుని జానకి రాకకోసం ఎదురుచూస్తున్నాడు. ఓనాడు నీట్‌గా అద్దంలా ఉండే ఆ ఇల్లు, ఇప్పుడు శ్మశాన నిశ్శబ్దంలో భూత్ బంగ్లాలా ఉంది. సౌందర్యాన్ని కోల్పోయిన ప్రతి వస్తువులోనూ జానకీ వియోగం ప్రతిఫలిస్తూ క్షణక్షణం రామారావులోని బాధను పదింతలు పెంచుతోంది.

పదిహేను రోజుల తర్వాత జానకి నుంచి ఉత్తరం వచ్చింది. రెండు వందల రూపాయల మనియార్డరు తిరిగి వచ్చేసింది. రామారావు ఉత్తరం విప్పుతుంటే చేతులు వణికాయి. కూడ బలుక్కుని జానకి రాసిన అక్షరాలు.

రామారావు గారికి,

నన్ను క్షమించండి, నేను అక్కడకు రాలేను ఇక్కడ హాయిగా ఉన్నాను. ఊరగాయలు, అప్పడాలు, వడియాలు, తయారుచేసి చుట్టు పక్కల ఫ్యాక్టరీల లోని ఉద్యోగస్తులకు అమ్ముతున్నాను. వారి కోరిక మీద ఒక చిన్న 'మెస్' ప్రారంభించాను. ఇన్నేళ్ళ మీ సాహచర్యంలో నేను నేర్చుకున్నది రుచిగా వండిపెట్టడం ఒక్కటే కదా! అదే ఈనాడు నాజీవనోపాధయింది. మీ డబ్బు మీకే పంపిస్తున్నాను. దయచేసి ఇక ముందు అలాంటి ఉత్తరాలు రాయకండి. ఇక్కడ అన్నయ్య, వదిన, పిల్లలు, నాకు ప్రేమ, ఆదరణ, అనురాగం, అందిస్తున్నారు. నా ఈ నిర్ణయం మంచిదో, చెడ్డదో నాకు తెలియదు, కానీ స్థిరమైనది.

మీకు ఏమీకాని..

-జానకి.

రామారావు మనస్సంతా వికలమైపోయింది. కుటుంబ వ్యవస్థలోని మాధుర్యం విలువ అతనికి ఇప్పుడు తెలిసింది.

శ్రీరాముడు లేనిపోని అపవాదులు విని జానకిని అడవులకు పంపించాడు. అది పురాణ కథ. విలువలు గ్రహించక చులకన చేసిన స్వార్థపు రాముడిని, తన వ్యక్తిత్వాన్ని కాపాడు కోవడంకోసం, ఆత్మస్థయిర్యంతో తనను జానకే విడిచింది.

ఇది వాస్తవ వ్యథ...

రామారావు వాలు కుర్చీలో వాలిపోయి అంధకార బంధురమైన శూన్యంలోకి చూస్తుండి పోయాడు?

❄